సాక్షి రంగారెడ్డి

బుధవారం । 27 । నవంబర్ । 2024



అందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



నిబంధనలు తప్పనిసరి

ప్రతి వాహనదారుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. 8లో▸



అధికారులపై మండిపాటు

అధికారుల నిర్లక్ష్య సమాధానంపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు షాద్‌నగర్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

హాజరు కానున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్: షాద్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకరోత్సవాన్ని బుధవారం ఉదయం 11గంటలకు పట్టణ శివారులోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ప్రమాణస్వీకారోత్సవానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కోరారు.

రేపు ఇండోర్ స్టేడియంలో కబడ్డీ ఎంపిక పోటీలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సీనియర్ మహిళల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు డిసెంబర్ 7న లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించే 71వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే మహిళలు 75 కిలోలలోపు బరువు ఉండాలని, వెంట ఆధార్‌కార్డు తేవాలని చెప్పారు. వివరాలకు 76619 92581, 90000 38272 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి సురేష్

కేశంపేట: ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి సురేష్ అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామ శివారులో ఉన్న రైతువేదికలో మంగళవారం మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మామిడి సాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు అధికారుల సూచనాలు పాటించాలని అన్నారు. ఉద్యాన పంటలైన మామిడితో పాటు మల్బరీ, పట్టు పురుగుల పెంపకం, ఆయిల్‌పామ్ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, రైతులు అధిక సంఖ్యలో సాగు చేసేందుకు ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన అధికారి హిమబిందు, సైంటిస్టు శ్రీకృష్ణ, ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రమోద్, అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి మంజుల, హెఈఓ రుక్మిణి, ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేయండి



మాలల సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ పిలుపునిచ్చారు. సింహగర్జనకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం సరూర్‌నగర్ భగత్‌సింగ్‌నగర్‌లో ఆవిష్కరించారు. రిజర్వేషన్లను శాశ్వతంగా ఎత్తేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింహగర్జనకు మాలలు తరలి రావాలని కోరారు.

29, 30 తేదీల్లో సైన్స్‌ఫెయిర్

మహేశ్వరం: శంషాబాద్‌లో ఈనెల 29, 30వ తేదీల్లో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి వై.శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సమాచార రంగం, సేంద్రియ పద్ధతులు, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, కాంపిటీషన్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అంశాలపై విద్యార్థులు ఆవిష్కరణలు చేయాలని సూచించారు.



షాబాద్ మండలం చందనవెల్లిలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్స్ పార్కు

పరిశ్రమల హబ్

పారిశ్రామికవేత్తల చూపు జిల్లా వైపు

- పలు కంపెనీల ఏర్పాటుకు ఆసక్తి
- ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పూర్తి
- మరికొన్ని చోట్ల నిర్మాణ దశలో..
- అన్నీ పూర్తయితే స్థానిక యువతకు పెరగనున్న ఉపాధి అవకాశాలు

శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు అతి సమీపంలో ఉన్న జిల్లా పరిశ్రమల హబ్‌గా మారింది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూమి అత్యధికంగా ఉండడంతో పెద్దపెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ప్రభుత్వాలు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన సకల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. జిల్లా అనువైన ప్రాంతం కావడంతో పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. కొన్ని కంపెనీలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మరికొన్ని చివరి దశకు చేరుకున్నాయి. మరికొన్ని ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయి. పూర్తయితే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.



చందనవెల్లిలోని కుందాన పరిశ్రమ

పరిశ్రమలు ఘనం.. ఉపాధి మార్గం

షాబాద్: మండలంలోని చందనవెల్లిలో 1,800 ఎకరాల ప్రభుత్వ భూమిలో రూ.8వేల కోట్లతో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిత్రం ఇక్కడి భూములను రైతుల నుంచి సేకరించి ప్రభుత్వం కంపెనీలకు అప్పగించింది. ప్రస్తుతం చందనవెల్లి, హైతాబాద్, మాచన్‌పల్లి గ్రామాల పరిధిలో వెల్‌స్పన్ గ్రూప్‌నకు సంబంధించిన టెక్స్‌టైల్స్, అమేజాన్, కటే రా, కుందానా తదితర కంపెనీలు ఏర్పాటు చేశారు. కొన్ని కంపెనీల నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

సీతారాంపూర్‌లో ఎలక్ట్రికల్ కార్ల కంపెనీ

మండంలోని సీతారాంపూర్ దేవాదాయ భూముల్లో ఎలక్ట్రికల్ కార్ల కంపెనీ ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయానికి సంబంధించి 1,148 ఎకరాల భూమి ఉంది. భూసేకరణ చేపట్టి ఈ దేవాదాయ భూములను టీఎస్ఐఐసీకి అప్పగించారు. ముంబై–బెంగళూరు లింక్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఈ భూముల్లో ఎలక్ట్రికల్ కార్ల కంపెనీ ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

స్థానికులకు ఉపాధి కల్పించాలి



చందనవెల్లి, సీతారాంపూర్, హైతాబాద్, మాచన్‌పల్లి, సీతారాంపూర్ పరిధిలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి. వాటిలో కంపెనీల ప్రతినిధులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

– కొలన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, చందనవెల్లి

❖ టీజీఐఐసీ ఆధీనంలోనే..



ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల కోసం సేకరించిన పొలం

కొత్తూరు: గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో మండలంలోని సిద్ధాపూర్‌లో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించింది. అనంతరం అసైన్డ్ రైతులకు పరిహారం అందజేసి సుమారు 330.34 ఎకరాల భూసేకరణ చేపట్టింది. ఈ ప్రక్రియ అనంతరం భూములను ప్రభుత్వం టీజీఐఐసీకి బదలాయించింది. భూసేకరణ ప్రక్రియ జరిగి సుమారు నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ పరిశ్రమలకు కేటాయించలేదు. తమ పొలాలను తీసుకున్న ప్రభుత్వం అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఉపాధి లభిస్తుందని అప్పట్లో స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో వారు ఎదురు చూస్తున్నారు.

భూసేకరణ ఇలా..

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం సిద్ధాపూర్‌లోని సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములు 330.34 ఎకరాలను సేకరించి టీజీఐఐసీకు బదలాయించింది గత ప్రభుత్వం. ఇందులో సుమారు 97.24 ఎకరాలు ప్రభుత్వ పొలం కాగా 160 ఎకరాలు అసైన్డ్, మిగతా 73.1 ఎకరాలు ఖాళీగా ఉంది. అప్పటి ప్రభుత్వం అసైన్డ్ రైతులకు ఎకరానికి రూ.10.50 లక్షలు పరిహారంగా అందజేసింది.

❖ అన్నీ వస్తే మహర్దశే..

పహాడీషరీఫ్: బాలాపూర్ మండలంలోని మామిడిపల్లిలో 99/1 సర్వే నంబర్‌లో టీజీఐఐసీ కేటాయించిన భూముల్లో పరిశ్రమల భవనాలకు సంబంధించి ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అదానీ ఏరోస్పేస్ పార్కుతో పాటు ఇంటర్వెర్టర్ కంపెనీలు ఇటీవలే నిర్మాణ పనులు పూర్తి చేసుకొని తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. మామిడిపల్లి గుట్టల్లోని 200 ఎకరాల ప్రభుత్వ భూములను టీజీఐఐసీకి కేటాయించగా, పెద్దపెద్ద గుట్టలు కావడంతో రోడ్లు వేసేందుకు చాలా సమయం పట్టింది. మరో పది కంపెనీలు భవనాలు నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ప్రారంభమైన రెండు కంపెనీల్లో స్థానికులు చిన్నచిన్న ఉద్యోగాల్లో చేరారు. హార్డ్‌వేర్ పార్కు ఫేజ్–2తో పాటు ఇతర కంపెనీలు ప్రారంభమైతే యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉండనున్నాయి.



మామిడిపల్లి గుట్టల్లో నిర్మాణ దశలో పరిశ్రమల భవనాలు

❖ 'పట్నం' పరిధిలో నిర్మాణ దశలో..



ఇబ్రహీంపట్నం ఎంఎస్ఎంఈలో నిర్మించిన షెడ్లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలో పలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు పనులు నిర్మాణ దశల్లో ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ఖాల్సా రెవెన్యూ పరిధిలోని 76 నుంచి 108 సర్వే నంబర్లలో సుమారు 450 ఎకరాల భూమిని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ఐఐసీ పదేళ్ల క్రితం సేకరించింది. ఇందులో గుట్టలను పగులగొట్టి, గోతులను పూడ్చి రోడ్లను వేశారు. ప్రధానంగా ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రహదారిలోని కట్టపై ఇబ్రహీం బాషా దర్గా నుంచి డబుల్ బీటీ రోడ్డు, ఇబ్రహీంపట్నం నుంచి గోసాల వెళ్లే రోడ్డులో ఉడుగుల పోచమ్మ దేవాలయం ఎదురుగా మరో మార్గాన్ని (బీటీ రోడ్డు) క్లస్టర్ పార్కుకు వెళ్లేందుకు నిర్మించారు. ప్రత్యేకంగా గేట్లను ఏర్పాటు చేశారు. నాగార్జునసాగర్, హైదరాబాద్ ప్రధాన రహదారికి ఈ రోడ్లను అనుసంధానం చేశారు. రవాణా సౌకర్యానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. నగరం నుంచి ఈ క్లస్టర్ పార్కుకు రావాలంటే 30 కిలోమీటర్లు మాత్రమే అవుతుంది. దీంతో పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆ దశగా కొన్ని కంపెనీలకు టీఎస్‌సీసీఐ భూముల కేటాయింపు జరిపింది. సుమారు ఆరేడు కంపెనీలు షెడ్ల నిర్మాణం పూర్తికాగా పలు కంపెనీల షెడ్ల నిర్మాణ దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం క్లస్టర్ పార్కులో నిర్మాణ మేస్త్రీలు, కూలీలు, సెక్యూరిటీ గార్డులు మాత్రమే అక్కడ పనులు చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నం సమీపంలోని క్లస్టర్ పార్కు

ఇబ్రహీంపట్నం మరింత అభివృద్ధి

క్లస్టర్‌పార్కులో నిర్మాణంలో ఉన్న కంపెనీలు ప్రారంభమైతే ఇబ్రహీంపట్నం ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. ఇక్కడి వాళ్లకే కాకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు ఉపాధి కోసం ఇక్కడికి తరలివస్తారు. దీంతో వ్యాపారాలు సైతం పుంజుకునే అవకాశం ఉంటుంది. సుమారు 70 నుంచి 100కు పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పేందుకు అవకాశాలున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.



నిర్మాణంలో ఉన్న వివిధ కంపెనీల షెడ్లు

పల్లె ప్రగతి పనులు భేష్



సర్దార్‌నగర్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఢిల్లీ అధికారుల బృందం

ఢిల్లీ అధికారుల బృందం కితాబు

షాబాద్: పల్లెప్రగతి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతో బాగున్నాయని ఢిల్లీ అధికారుల బృందం సభ్యులు కితాబిచ్చారు. అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రాం ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ స్టడీ ఇన్ రూరల్ ఏరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఢిల్లీ నుంచి 12 మంది సీనియర్ అధికారుల బృందం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని సందర్శించింది. పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా చేపట్టిన పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, కంపోస్టు యార్డు, తెలంగాణ క్రీడా ప్రాంగణం, హరితహారం నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్ తదితరాలను బృందం సభ్యులు పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి ఎస్‌హెచ్‌జీ గ్రూపుల వినియోగాన్ని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే అతి పెద్ద సంతగా పేరుగాంచిన సర్దార్‌నగర్ పశువుల సంతను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనులు బాగున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ, జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్‌మోహన్, ఎంపీడీఓ అపర్ణ, డీఎల్పీఓ సతీశ్, ఎంపీఓ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి కవిత, టెక్నికల్ అసిస్టెంట్ అనిత తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని వినియోగించుకోవాలి



పంచాయతీ కార్మికురాలిని సన్మానిస్తున్న పీడీ శ్రీలత

డీఆర్‌డీఓ పీడీ శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయరంగ అనుబంధ పనులకు అనుసంధానం చేయడం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.శ్రీలత పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు, భారత రాజ్యాంగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడులో నాటు కోళ్ల పెంపకానికి మహిళా సంఘాల ద్వారా లబ్ధి పొందిన బుట్టి రాధికకు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.2,99,600తో కోళ్ల షెడ్డు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఉపాధి హామీలో ఎక్కువ పనిదినాలు చేసిన కవిత, మొక్కలు పెంపకంలో శ్రద్ధ వహించిన గణేశ్, గ్రామంలో పారిశుద్ధ్య కార్మికురాలు రాములమ్మను సత్కరించారు. భారత రాజ్యాంగం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. రైతులకు ఎన్నో అవకాశాలు కల్పించం జరుగుతోందని, వాటిని వినియోగించుకోవాలని కోరారు . ఎంబ్రాయిడింగ్, వర్కు, రెడీమేడ్ బట్టల షాపు, గూడ్స్ ట్రాలీ, బోరు మోటర్లు బావి నుంచి తీసే యంత్రం మొదలైన యూనిట్లు నిర్వహిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. లోను పూర్తి చేయగానే పెద్ద మొత్తంలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల్లో ఇప్పటి వరకు సభ్యులుగా లేని వారిని సంఘాల్లోకి ఆహ్వానించి సభ్యులుగా చేర్చుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నవీన్‌రెడ్డి, ఏపీడీ నరేందర్‌రెడ్డి, ఏపీడీ సూర్యారావు, ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్పతినాయక్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఏపీఓ తిరుపతాచారి, ఐకేపీ ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, సీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మందిరాల వద్ద రక్షణ చర్యలు తీసుకోండి

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: మందిరాలవద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఏసీపీ రంగస్వామి సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పూజారులు, ఇమాంలు, ఫాదర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలవద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాత్రి సమయాల్లో మందిరాలు, మసీదులు, చర్చిల్లోకి ఇతరులు ప్రవేశించకుండా తాళం వేసుకోవాలని సూచించారు. తలుపులు గట్టిగా ఉండాలని, సీసీ కెమెరాలు, మందిరాల పరిసరాలు పూర్తిగా కనిపించేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల మందిరాలవద్ద కొన్ని ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో అలాంటి వాటిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సుశీల, రాంచందర్, బల్‌రాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

మహేశ్వరం: సన్న రకం వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహా రావు పేర్కొన్నారు. కందుకూరు మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా పంటల సాగు, ఆధునిక పద్ధతుల గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలన్నారు. ఏ రకం వరి ధాన్యం క్వింటాల్‌కు ధర రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ఆయిల్‌పాం పంటల సాగు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏడీఏ సుధారాణి, మండల వ్యవసాయాధికారి కృష్ణమోహన్, మండల ఉద్యానవన అధికారి సౌమ్య, ఏఈఏలు రాజు, జగదీశ్వర్‌చారి, రాఘవేంద్రచారి, శ్రీహరి, సమియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నర్సింహారావు తదితరులు

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు



కోనాపూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజాపాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందన్నారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో మంగళవారం మన ఊరిలో పనుల జాతరలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మించే పశువుల షెడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, జగన్, బిక్యానాయక్, హన్మానాయక్, వెంకటేశ్, ఫరీద్, జహంగీర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో కలపొద్దంటూ వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దేవునిఎర్రవల్లివాసులు

కలెక్టర్‌ను కలిసిన దేవునిఎర్రవల్లి గ్రామస్తులు

చేవెళ్ల: తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమ గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల మున్సిపాలిటీలో దేవునిఎర్రవల్లి గ్రామాన్ని కలపడానికి ఈనెల 2వ తేదీన నిర్వహించిన సభలో గ్రామస్తులంతా వ్యతిరేకించినట్లు తెలిపారు. మున్సిపాలిటీతో పెరిగే ట్యాక్స్‌లు, జాతీయ ఉపాధి హామీ పథకం లాంటి పథకాలు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బక్కయ్య, చంద్రయ్య, రంగారెడ్డి, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, రాజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణ, రమేశ్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

కల్లు డిపోపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పట్టణంలోని కల్లు దుకాణాలపై మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలరాజు నేతృత్వంలో అధికారులు పట్టణ శివారులోని కల్లు డిపో, పట్టణంలోని వివిధ కల్లు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిళ్లను సేకరించినట్లు తెలిసింది.

మందుల కొరత లేదు..

'సాక్షి' కథనంపై

తెలంగాణ మెడికల్ సర్వీసెస్ స్పందన

సాక్షి, సిటీబ్యూరో: 'దగ్గు, జలుబు మందులూ కరువే' అన్న శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ స్పందించింది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులు ఉన్నాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎంఎస్ హైదరాబాద్, సీఎంఎస్ రంగారెడ్డిలో అన్ని రకాల జబ్బులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రాంటిడిన్, క్లోర్‌ఫెనిరమైన్ మాలియేట్ మందులు ఏఎంఎల్ మెడిసిన్ జాబితాలోలేవని వివరించారు. మందులు అయిపోయిన వెంటనే సంబంధిత సీఎంఎస్ స్టోర్స్ నుంచి తెప్పించుకుంటున్నట్టు పేర్కొన్నారు.

గంజాయి, డ్రగ్స్ పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ఎస్‌టీఎఫ్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ముగ్గురు నిందితుల నుంచి రూ.1,84,500 లక్షల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2.7 కిలోల గంజాయి, 11 గ్రాముల ఎండీఎంఏ, 3 ఎల్ఎస్డీ బ్లాట్స్ లభించాయి. వీటి విలువ రూ.1,84,500 ఉంటుందని అంచనా. దాడుల్లో ఒక కారు, స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6లక్షలు ఉంటుంది. గంజాయి డ్రగ్స్ అమ్మకాలకు పాల్పడుతున్న పి.సాయిబాబు, వై. వెంకటరెడ్డి, వి. సోనియా ఎలిషా అలియాస్ ప్రియాంకను అరెస్టు చేసి గోల్కొండ ఎక్సైజ్‌పోలీసులకు అప్పగించారు.

రెండు ఎస్టీపీలను సందర్శించిన ఈడీ

సాక్షి, సిటీబ్యూరో: ఎస్టీపీ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న రెండు మురుగు నీటి శుద్ధి కేంద్రాలను మంగళవారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ సందర్శించారు. 320 ఎంఎల్డీ సామర్థ్యంతో నాగోల్‌లో, 10 ఎంఎల్డీ సామర్థ్యంతో వెన్నెలగడ్డలో నిర్మిస్తున్న ఎస్టీపీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్ని పరిశీలించి..ఎస్టీపీ ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం సుందరీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ముగింపు దశలో ఉన్న పనుల్ని వేగంగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్–1 సుదర్శన్, ఎస్టీపీ సీజీఎం పద్మజ, జీఎం సత్యనారాయణ, అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులపై మండిపాటు

పనితీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సూచన



యాచారం: చౌదర్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: అధికారుల నిర్లక్ష్య సమాధానంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అయ్యవారిగూడెం, చౌదర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. చౌదర్‌పల్లిలో వారం రోజులుగా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కొంతమంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని చెప్పారు. దీంతో మిషన్ భగీరథ అధికారులను ఎమ్మెల్యే రంగారెడ్డి పిలిచి గ్రామానికి నీటి సరఫరా ఎందుకు కావడం లేదని మండిపడ్డారు. ఏఈ రవినాథ్‌ను వివరణ అడిగి.. పనితీరు మార్చుకోవాలని ఆగ్రహించారు. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డిపై సైతం మండిపడ్డారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని హితబోధ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫ్యూచర్‌సిటీ నిర్మాణంతో యాచారం మండలానికి బంగారు భవిష్యత్తు ఉందన్నారు. పలు ప్రముఖ కంపెనీలతో ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మస్కు నర్సింహ, అరవింద్‌నాయక్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా అడుగులు

మంచాల: గ్రామాలు సంపూర్ణ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మంచాల మండలంలోని రంగాపూర్, చీదేడ్ గ్రామాల్లో రూ.36 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేసిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాల శంకర్, డీఈఈ అబ్బాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు ఈసీశేఖర్‌గౌడ్, మహిపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, ఎల్లేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులతో అభివృద్ధి



క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శమని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలకు సమాన హక్కులు, రిజర్వేషన్‌లను కల్పించాలనే ఆలోచనతో బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో అభివృద్ధి సాధ్యమన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, శివశంకర్‌గౌడ్, బాబర్‌అలీఖాన్, రఘునాయక్, బసవేశ్వర్, అందెమోహన్, శ్రీనివాస్‌యాదవ్, ముబారక్‌అలీ, శ్రీనునాయక్, మల్లేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నటుడు శ్రీతేజ్‌పై మహిళ ఫిర్యాదు

మూసాపేట: వంగవీటి, నా సామిరంగా, నారప్ప వంటి సినిమాల్లో నటించిన తెలుగు హీరో శ్రీతేజ్ పెళ్లి పేరుతో తనను మోసం చేశాడని ఆరోపిస్తూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. కారంచేడుకు చెందిన ఓ మహిళ (35) మొయినాబాద్‌లో నివాసం ఉంటుంది. మూసాపేటలోని ఆంజనేయ నగర్‌లో నివాసం ఉండే సినీ హీరో శ్రీతేజ్‌తో 2014లో ఒక ఈవెంట్‌లో పరిచయం అయింది. ఆ తరువాత సోషల్ మీడియా ద్వారా మరింత దగ్గరయ్యారు. ఈ క్రమంలో శ్రీతేజ్ వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో పాటు ఖర్చుల నిమిత్తం తన వద్ద సుమారు రూ.20 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వలేదని మహిళ ఫిర్యాదులో పేర్కొంది. వాస్తవంగా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే శ్రీతేజ్‌పై ఆ మహిళ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. తిరిగి ఈ నెల 24వ తేదీన సదరు మహిళ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఇదే అంశంపై శ్రీతేజ్‌పై ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయటంతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూరికి వెళ్లొస్తూ.. అనంత లోకాలకు


రైలు దిగుతూ జారిపడి మహిళ దుర్మరణం



ఉమ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: స్వగ్రామానికి వెళ్లి వస్తున్న మహిళ.. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుతానని భావించింది. కానీ విధి ఆడిన నాటకానికి బలైంది. రైలు దిగుతూ కాలు జారి పడటంతో అనంత లోకాలకు చేరుకుంది. ఈ విషాద ఘటన పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం వెల్‌మాల గ్రామానికి చెందిన సురేష్, ఉమ(33) దంపతులు. కుటుంబంతో కలిసి సీఎస్కే విల్లాస్ సమీపంలోని గురురాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటున్నారు. సురేష్ మొగిలిగిద్ద సమీపంలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వగ్రామం వెల్‌మాలలో శుభకార్యం ఉండటంతో ఉమ అక్కడకు వెళ్లింది. ఆమె గుంటూరు రైలులో తిరిగి సోమవారం షాద్‌నగర్‌కు బయలుదేరింది. రైల్వే స్టేషన్‌లోని 3వ ఫ్లాట్ ఫాంలో దిగుతుండగా కాలుజారి ప్రమాదవశాత్తు ఆమె రైలు కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. స్టేషన్ మాస్టర్ మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు.

ఎలక్ట్రానిక్ దుకాణంలో అగ్ని ప్రమాదం



పూర్తిగా దగ్ధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు

మీర్‌పేట: షార్ట్ సర్క్యూట్ జరిగి షాపులోని ఎలక్ట్రానిక్ పరికరాలు కాలి బూడిదైన సంఘటన మీర్‌పేట పరిధిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బాలాపూర్ చౌరస్తాలోని శ్రీ రామ ఏసీ, రీఫ్రిజిరేటర్స్ సేల్స్ అండ్ సర్వీస్ ఎలక్ట్రానిక్ షాపులో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ జరిగి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆరిపేశారు. ఈ ప్రమాదంలో షాపులోని ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

చేవెళ్లలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

చేవెళ్ల: ప్రతి వాహనదారుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో శంకర్‌పల్లి రోడ్డులోని హనుమాన్ టెంపుల్ సమీపంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 17 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ.. మైనర్‌లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌లు పొంది, అన్ని రకాల ధ్రువ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రాణాలకు ముప్పు ఉందని హెచ్చరించారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తదితరులు

కిటికీ స్ర్కూలు తొలగించి

ఇంట్లో చొరబడి నగదు, బంగారు, వెండి ఆభరణాల చోరీ

మీర్‌పేట: ఇంట్లో దొంగలు పడి నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ప్రశాంతిహిల్స్‌లోని పింగిళి అపార్ట్‌మెంట్ 101 ఫ్లాటులో నివాసముండే రాసోజు మోహన్ సోమవారం రాత్రి కుటుంబంతో కలిసి మల్కాజిగిరి మౌలాలిలోని బంధువుల శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉంచిన రూ.5 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం, రెండు తులాల వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగలు రాత్రివేళ కిటికీ స్ర్కూలు తొలగించి ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడినట్లు సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



సీసీ టీవీలో రికార్డు అయిన నిందితుడు

మాడ్గులలో ఎక్సైజ్‌శాఖ దాడులు

మాడ్గుల: మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లో మంగళవారం ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాయక్ చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా, బెల్లం స్వాధీనం చేసుకొని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాటుసారా తయారు చేస్తున్న మండలంలోని చిన్న తండాకు చెందిన నేనావత్ గుండు, నేనావత్ దాస్లీ, సక్రీ, మన్య తండాకు చెందిన లాలు, దిల్వార్ ఖాన్‌పల్లికి చెందిన ఈదయ్యలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో 16 లీటర్ల నాటుసారా, 50 కేజీల బెల్లం, 10 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నారు. 100 కిలోల బెల్లం పానకం ధ్వసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శంకర్, నరసింహ, బాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన సారాతో ఎక్సైజ్ పోలీసులు

రెండు రోజులు.. నాలుగు జ్యువెలరీ షాపులు

దృష్టి మళ్లించి దర్జాగా దొంగతనాలు

కేపీహెచ్‌బీకాలనీ: కొనుగోలుదారు రూపంలో బంగారు నగల షోరూంలకు వెళ్లి..విలువైన బంగారు నగలు కొనుగోలు చేస్తున్నట్లు హడావుడి సృష్టించి.. విక్రయదారుల దృష్టి మళ్లించి బంగారు నగలతో ఉడాయిస్తున్న ఓ కి'లేడీ' ఆట కట్టించారు కేపీహెచ్‌బీ పోలీసులు. రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు పేరొందిన షోరూముల్లో బంగారు నగలు చోరీ చేసిన ఆమెను పట్టుకుని..సుమారు రూ.50 లక్షల విలువ చేసే 23 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ గోకుల్ టవర్స్‌లో నివాసం ఉండే పుట్టా సునీత (41) ముఖానికి మాస్క్ ధరించి ఈ నెల 23న సాయంత్రం కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్.1లోని దేవి జ్యువెలరీస్‌కి వెళ్లింది. విలువైన బంగారు ఆభరణాలు చూపించమని సేల్స్‌మెన్‌లను అడిగిన ఆమె..వారి దృష్టి మళ్లించి విలువైన హారాన్ని దొంగిలించి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇదే క్రమంలో టెంపుల్ బస్టాప్ వద్ద గల నాకోడా జ్యువెలరీస్‌లో కూడా అదే రోజు బంగారు ఆభరణాలు కొనే ముసుగులో అక్కడి వారి దృష్టి మళ్లించి విలువైన హారాన్ని దొంగిలించింది. కొద్దిసేపటి తర్వాత బంగారు హారం కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన నాకోడా జ్యువెలరీస్ నిర్వాహకులు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు మాస్క్ వేసుకున్న మహిళే దొంగతనం చేసినట్లు నిర్ధారించుకొని నిఘా పెట్టి మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకుంది. దేవి, నాకోడా జ్యువెలరీస్‌తో పాటు 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సీఎంఆర్, సిరి షోరూమ్‌లలో కూడా చోరీకి పాల్పడినట్లు అంగీకరించింది. ఆమె వద్ద నుంచి 23 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. తక్కువ సమయంలో దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, డీఐ రవికుమార్, ఇతర పోలీస్ సిబ్బందిని డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌లు అభినందించారు.